సాక్షి
సూర్యాపేట

శనివారం, 29, ఏప్రిల్, 2023



హామీలు అమలు చేస్తేనే..
ఇచ్చిన హామీలు అమలు చేస్తేనే బీఆర్‌ఎస్‌కు వంద సీట్లు వస్తాయని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. - IIలో



బతుకుదెరువుకు వలస వెళ్లి..
బతుకుదెరువు కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వలస వెళ్లిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. - IIలో

గరిష్టం/కనిష్టం
37°/25°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా సమ్మర్ వెకేషన్ జడ్జీల నియామకం

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా సమ్మర్ వెకేషన్ జడ్జీలను నియమిస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మే 3 నుంచి 31 వరకు సెలవులు కావడంతో ఈ మధ్య కాలంలో కేసుల పరిష్కారం కోసం ప్రత్యేకంగా సమ్మర్ వెకేషన్ జడ్జీలను నియమించింది. మే 3 నుంచి 16 వరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, మే 18 నుంచి 31 వరకు రెండో విడత జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కుశ బాధ్యతలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా కోర్టుల పరిధిలో ఉన్న సివిల్ కేసులు, క్రిమినల్ కేసుల్లో అత్యవసర బెయిల్ పిటిషన్లు పరిశీలిస్తారు.

కక్షిదారులకు అందుబాటులో ఉండాలి



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

చివ్వెంల(సూర్యాపేట): న్యాయవాదులు కక్షిదారులకు అందుబాటులో ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌతంప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన పదవీ విరమణ దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇన్ని రోజులు తనకు సహకరించిన న్యాయవాదులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కుశ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రావణ్ కుమార్, సూర్యాపేట జూనియర్ సివిల్ జడ్జి సురేష్, హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి సాకేత్‌మిత్ర, సూర్యాపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సాహితి

తుంగతుర్తి: దోమల ద్వారా వ్యాపించే వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ సాహితి అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అన్నారం గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల వ్యాప్తి ని నివారించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారులు మమత, భూక్య నాగునాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ షబోద్దీన్, హెచ్ఈఓ సముద్రాల సూరి, సిబ్బంది చొక్కయ్య, వేణుగోపాల్, నాగరాజు, సతీష్, గాజుల సోమయ్య, నవీన్ పాల్గొన్నారు.

అనుమతులు లేని లేఅవుట్లను తొలగించాలి

హుజూర్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్లను వెంటనే తొలగించాలని మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రవణ్ కుమార్, కౌన్సిలర్లు తేజావత్ రాజా నాయక్, కోతి సంపత్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం హుజూర్‌నగర్‌కు వచ్చిన అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

రికార్డుల పరిశీలన

అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ శుక్రవారం హుజూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయ రికార్డులను పరిశీలించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి గతంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో అదనపు కలెక్టర్ రికార్డులు పరిశీలించినట్లు తెలిసింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెంలోని సబ్‌మార్కెట్ యార్డు, ఇతర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం రాంపతి పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాలను మిల్లులకు పంపుతున్నామని తెలిపారు. రైతులు అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట రైతులు నిమ్మల యాదయ్య, సందీప్, నాగార్జున్, సురేష్ తదితరులున్నారు.

ఒక్కటై కదిలారు..

చేతులు కలిపి.. నవ్వులు చిందించిన రేవంత్, వెంకట్‌రెడ్డి, ఉత్తమ్



నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన సభకు హాజరైన కార్యకర్తలకు అభివాదం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- అందరూ ఒకే వేదికపైకి రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం
- ఒకరికొకరు పొగడ్తలు
- నేతల ప్రసంగాలకు యువకుల కేరింతలు
- రేవంత్ సభతో కార్యకర్తల్లో ఊపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నల్లగొండలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీ, హాథ్ సే హాథ్ జోడో యాత్ర, బహిరంగ సభ కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపాయి. ఇన్నాళ్లుగా జిల్లా నేతలు ఎవరికి వారే అన్నట్లుగా ఉండగా, చాలా రోజులపాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో అంటీముట్టనట్లుగానే వ్యవహరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నల్లగొండలో నిర్వహించిన రేవంత్ సభకు జిల్లా నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జానారెడ్డి అంతా ఒకే వేదికపై కనిపించారు. దీంతో కార్యకర్తల ఈలలు, కేరింతలతో సభా ప్రాంగణం మారుమోగింది. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మునుగోడు ఉప ఎన్నిక సందర్భంలో మాత్రమే నల్లగొండ జిల్లాకు వచ్చారు. నిరుద్యోగ నిరసన ర్యాలీ సందర్భంగా శుక్రవారం నల్లగొండకు వచ్చిన రేవంత్‌రెడ్డికి ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లిలో ఆయనకు పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మొదటగా రేవంత్‌రెడ్డి మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడారు. అక్కడికి కూడా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. అక్కడి నుంచి వాహనాల్లో నల్లగొండ పట్టణ శివారు మర్రిగూడ బైపాస్ వరకు వచ్చారు. అక్కడి నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు ఆయన వెంట నడిచారు. గడియారం సెంటర్‌కు రేవంత్ రాత్రి 7.30 గంటలకు చేరుకున్నారు. రెండున్నర గంటలకుపైగా గడియారం సెంటర్‌లో సభ నిర్వహించారు. సభాస్థలికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాహనంలో ర్యాలీగా వస్తుండగా కార్యకర్తలు కేరింతలు కొట్టారు. వేదికపైకి చేరుకుని నేతలు ప్రసంగాలు ప్రారంభించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రసంగిస్తుండగా పెద్ద ఎత్తున ఈలలు, కేరింతలు కొట్టారు. ఉత్తమ్, జానారెడ్డి ప్రసంగాల సమయంలో కూడా అదే హుషారు కనిపించింది. ఆ తర్వాత టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఆయన ప్రసంగం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపింది. పెద్ద ఎత్తున ఈలలు, కేకలు పెట్టారు. పార్టీ శ్రేణులతోపాటు ఇతర ప్రజలు కూడా రేవంత్ ప్రసంగం వినేందుకు వచ్చారు. మొత్తానికి రేవంత్ నల్లగొండ సభ విజయవంతమైంది. మొదటిసారిగా నల్లగొండకు రేవంత్ రావడం, జిల్లా నేతలు అందరూ పాల్గొనడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింప్పైంది. 'మాలో భిన్న అభిప్రాయాలు ఉన్నా అవసరం వచ్చినప్పుడు మేమంతా ఒక్కటే' అనే దానికి నల్లగొండ వేదికే నిదర్శనమని జానారెడ్డి చెప్పడంతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం నెలకొంది. వచ్చే ఎన్నికల్లో నల్లగొండ జిల్లాను కాంగ్రెస్ కంచుకోటగా నిలిపేందుకు సభ ఎంతగానో ఉపయోగపడనుంది.



సభలో అభివాదం చేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, పక్కన ఉత్తమ్



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎంజీయూ విద్యార్థులు

కాంగ్రెస్ వస్తేనే సమస్యలు పరిష్కారం

- రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- రెండేళ్లు గడిచినా నెల్లికల్లు పూర్తి కాలే
- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కాంగ్రెస్ హయాంలోనే జిల్లాకు సాగు, తాగునీరు : జానారెడ్డి



ర్యాలీలో కాంగ్రెస్ జెండాతో కోమటిరెడ్డి

నల్లగొండ : కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ మంత్రి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండలో నిరుద్యోగ నిరసన ర్యాలీ అనంతరం గడియారం సెంటర్లో ఏర్పాటు చేసిన సభలో కోమటిరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ధాన్యం కల్లాల్లో ఉంటే కేసీఆర్ ఔరంగాబాద్‌లో తిరుగుతుంటే నాయకులు మాత్రం ఆత్మీయ సమ్మేళనం అంటూ బాంబులు కాల్చి ప్రజలను పొట్టనబెట్టుకున్నారని విమర్శించారు. నల్లగొండలో బొద్దుపల్లి శ్రీనును చంపితే ఇప్పటికీ చార్జిషీట్ వేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనులు, నిరుద్యోగులు ఉద్యమిస్తే.. తాను కూడా సొంత పార్టీని ఎదిరించి పోరాడి మంత్రి పదవికి కూడా రాజీనామా చేశానని గుర్తు చేశారు. అమరవీరుల త్యాగంతో సోనియా గాంధీ తెలంగాణ ఇస్తే కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నాడని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్న నల్లగొండలో కళాశాలల్లో కనీసం బాత్రూంలు లేని దుస్థితి ఉంటే తానే రూ.70 లక్షలు ఖర్చు చేసి నిర్మించానని చెప్పారు. ఈసారి నల్లగొండలో పోటీ చేస్తున్నానని.. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కంచుకోట అని.. అందుకోసం 12 అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తామంతా ఐక్యంగానే ఉన్నామని అందరం కలిసి బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు చేసే పోరాటానికి సంపూర్ణ మద్దతు అందించాలని ప్రజలను కోరారు.

బీఆర్‌ఎస్‌ను ఇంటికి సాగనంపాలి: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గతంలో జిల్లాలో 12 స్థానాలకు 12 మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి కంచుకోటగా నిలిపారని.. 2019లో దేశంలో ఏ జిల్లాలో లేని విధంగా నల్లగొండ జిల్లా నుంచి ఇద్దరు ఎంపీలను కాంగ్రెస్ నుంచి గెలిపించి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. నెల్లికల్లు లిఫ్టు పనులను సంవత్సర కాలంలో పూర్తి చేయకపోతే రాజీనామా చేస్తానని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రకటించారని రెండేళ్లు గడిచినా లిఫ్టు పూర్తి కాలేదన్నారు. మిషన్ భగీరథకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని.. కానీ, నల్లగొండ జిల్లా పరిషత్ సమావేశంలో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులే నీళ్లు రావట్లేదని గగ్గోలు పెడుతున్నారంటే ఆ నిధులు ఏం చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు.

ఐక్యంగా ముందుకెళ్తాం : జానారెడ్డి



జిల్లా నేతల్లో చిన్న చిన్న అభిప్రాయ భేదాలు ఉన్నా తామంతా ఐక్యంగా ముందుకుపోతామని అందుకు నల్లగొండ వేదికే నిదర్శనమని మాజీ మంత్రి జానారెడ్డి చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే జిల్లాకు సాగు, తాగు నీరు అందాయన్నారు. బీఆర్‌ఎస్‌ది కమీషన్ల ప్రభుత్వమని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని మాట తప్పిందని.. కానీ, కాంగ్రెస్ హయాంలో 30లక్షల ఎకరాల భూమిని పంచామన్నారు. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులు, ప్రజలంతా ఏకమై కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే : వీహెచ్

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. ఎలాంటి సందేహం అవసరం లేదని పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన మాట నిలుపుకోవడంలో విఫలమయ్యాడన్నారు. అల్లుడు ఇంటికొస్తే ఎక్కడ పడుకుంటాడని.. అందు కోసం డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తానని చెప్పి ఓట్లు కొట్టేసిన దొంగ కేసీఆర్ అని విమర్శించారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని స్పష్టం చేశారు. ఈసారి జిల్లాలో ఎస్సీ, బీసీలకు 6 సీట్లు ఇవ్వాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో కాంగ్రెస్ పరిశీలకుడు రోహిత్‌చౌదరి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీలు బలరామ్‌నాయక్, మల్లు రవి, భువనగిరి, సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, చెవిటి వెంకన్న, దుబ్బాక నర్సింహారెడ్డి, పున్న కైలాస్‌నేత, పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాలునాయక్, నాయకులు కొండేటి మల్లయ్య, రాములునాయక్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఓటమి నుంచి స్ఫూర్తి పొందాలి



ప్రేరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అడిషనల్ కలెక్టర్ తదితరులు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: ఓటమి నుంచి స్ఫూర్తి పొందడమే అసలైన గెలుపు అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు శుక్రవారం సూర్యాపేటలోని రవి మహల్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తన అనుభవాలతో అభ్యర్థులకు ప్రేరణ కల్పించారు. యువత నిరంతరం ఆశావాహులై ఉండాలన్నారు. ఆలోచనల్లో పేదరికాన్ని దరి చేరనీయొద్దన్నారు. ఆలోచనలు గొప్పగా ఉంటేనే జీవితంలో ఎత్తుకు ఎదగవచ్చని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏదైనా సాధించాలనే తపనతో పాటు యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సూర్యాపేట నుంచి పరీక్షకు హాజరయ్యే 193మంది యువతీ, యువకులకు ముందస్తుగా మంత్రి అభినందనలు తెలిపారు. ఏడాది కాలంగా అభ్యర్థులకు శిక్షణ ఇచ్చిన అధ్యాపకులు, పోలీసులను ఆయన సత్కరించారు. అనంతరం అభ్యర్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్, అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ రాములు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైలాన్ నిర్మాణ పనుల పరిశీలన

సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువు (మినీ ట్యాంక్ బండ్) మధ్యలో 25ఫీట్ల ఎత్తుతో రూ.72లక్షల వ్యయంతో పైలాన్ నిర్మించనున్నారు. దాని కింద భాగాన ఆహ్లాదకరమైన గార్డెన్‌తో పాటు సేదతీరేందుకు క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్మాణ పనులను శుక్రవారం మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి బల్లకట్టుపై చెరువులోకి వెళ్లి పరిశీలించారు.



సద్దల చెరువులో పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించేందుకు బల్లకట్టుపై వెళ్తున్న మంత్రి

డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా తోట కిరణ్

సూర్యాపేట: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ తోట కిరణ్ ఎన్నికయ్యారు. జిల్లా దంత వైద్యుల సంఘం ఎన్నికలు శుక్రవారం స్థానిక బృందావన్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, డీఎంహెచ్ఓ కోటాచలం, సూర్యాపేట ఐఎంఏ అధ్యక్షుడు బీఎం చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. దంత వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారిగా దినేష్‌ను ఎన్నుకున్నారు. సీనియర్ దంత వైద్యులు శేఖర్‌రెడ్డి, నిర్మల్‌కుమార్, రంజిత్, యశ్వంత్ పాల్గొన్నారు.

గడువు రెండు రోజులే..

- మున్సిపాలిటీల్లో ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ
- రేపటి వరకే అవకాశం
- ఇప్పటివరకు 50 శాతం కూడా దాటని వసూళ్లు
- ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుజూర్‌నగర్: మున్సిపాలిటీల్లో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి మున్సిపల్ శాఖ ఐదు శాతం రాయితీ కల్పించింది. ఈ రాయితీ చెల్లింపులపై ప్రభుత్వం ఈనెల చివరి వరకు అవకాశం కల్పించినా ప్రక్రియ నామమాత్రంగానే సాగుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన గడువు రెండు రోజుల్లో ముగియనున్నా.. వసూళ్లు ఇప్పటివరకు 50 శాతం కూడా దాటలేదు. రాయితీపై సంబంధిత అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఈ అవకాశాన్ని పొందలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తే రాయితీ సద్వినియోగమయ్యే అవకాశం ఉంది. తద్వారా ఆయా మున్సిపాలిటీలకు ఆశించిన స్థాయిలో ఆస్తి పన్ను వసూలు కానుంది.

బకాయిలు లేని వారికే..

గత ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఆస్తిపన్ను బకాయిలు ఏమీ లేకుండా పూర్తిగా చెల్లించిన వారికి ఈ ఐదు శాతం రాయితీ విధానం వర్తిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తాజా పన్ను చెల్లించే వారినే అధికారులు అర్హులుగా ఎంపిక చేసి రాయితీని వర్తింపజేస్తారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలైన సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్లలోని అసెస్మెంట్లలో కొన్ని భవనాలు మాత్రమే ఐదు శాతం రాయితీ పథకానికి అర్హత సాధించాయి. వారి నుంచి మాత్రమే రాయితీ ఆస్తి పన్ను వసూళ్లు చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ కొనసాగుతుంది.

సరైన ప్రచారం చేయకపోవడంతో..

పలు మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా బిల్ కలెక్టర్లు ఆస్తి పన్ను వసూళ్లు ముమ్మరం చేసినా అది 50శాతం కూడా దాటలేదు. ఇప్పటి వరకు చేసిన వసూళ్లలో సూర్యాపేట 39.41 శాతం వసూళ్లలతో మొదటి స్థానంలో ఉండగా తర్వాతి స్థానాల్లో హుజూర్‌నగర్, కోదాడ, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీలు ఉన్నాయి. పలు మున్సిపాలిటీల్లో సరైన ప్రచారం చేయకపోవడం, అది ప్రజలకు చేరకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీని పలువురు వినియోగించుకోవడం లేదని తెలుస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు 5 శాతం రాయితీపై ఆస్తి పన్ను చెల్లింపునకు రెండు రోజులు గడువు మిగిలి ఉంది. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఆయా భవనాల యజమానులు ముందస్తు రాయితీ పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి.

– శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

ఈ నెల 28 వరకు వసూలైన పన్నుల వివరాలు..

- సూర్యాపేట మున్సిపాలిటీలో 24,140 భవనాలపై రాయితీ పన్ను ద్వారా రూ 9.27 కోట్ల ఆదాయం సమకూరాల్సి ఉండగా రూ 3.70 కోట్లు వసూలైంది.
- హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 2,437 భవనాలపై రాయితీ పన్ను ద్వారా రూ 84.37 లక్షలు ఆదాయం చేకూరాల్సి ఉండగా రూ.33 లక్షలు వసూలైంది.
- కోదాడ మున్సిపాలిటీలో 11,979 భవనాలపై రాయితీ పన్ను ద్వారా రూ 3.38 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా రూ 1.29 కోట్లు వసూలయ్యాయి.
- తిరుమలగిరి మున్సిపాలిటీలో 5,275 భవనాలపై రాయితీ పన్ను ద్వారా రూ.95 లక్షలు ఆదాయం రావాల్సి ఉండగా రూ 21.01 లక్షలు వసూలైంది.
- నేరేడుచర్ల మున్సిపాలిటీలో 2,879 భవనాలపై రాయితీ పన్ను ద్వారా రూ 64.58 లక్షల ఆదాయం రావాల్సి ఉండగా రూ.14 లక్షలు వసూలయ్యాయి.

ఓటరు జాబితా సవరణ నిరంతర ప్రక్రియ

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఓటరు జాబితా సవరణ నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు నమోదుపై ప్రజలను చైతన్యపరిచి అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితా సవరణకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఏఆర్వోలు రాజకీయ పార్టీల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రతివారం పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ ఏజెంట్లను నియమించాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓలు రాజేంద్రకుమార్, వెంకారెడ్డి, కిశోర్ కుమార్, ఎన్నికల విభాగాధికారి పద్మారావు వివిధ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారి మృతి కేసులో వ్యక్తికి జైలు

భువనగిరి : చిన్నారి మృతి కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ భువనగిరి కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. భువనగిరి రూరల్ ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం .. బీబీనగర్ మండలం రావిపహాడ్‌కు చెందిన బొల్లేపల్లి జనార్దన్ కుటుంబ సభ్యులు 2014 లో భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన శుభాకార్యానికి వచ్చారు. ఈ క్రమంలో రాజస్తాన్‌కు చెందిన లారీడ్రైవర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి జనార్దన్ కూతురు ఆనంది(5)ని ఢీకొట్టడంతో మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మధుసూదన్ రెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. శుక్రవారం జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి నాగేశ్వర్‌రావు కేసును విచారించి డ్రైవర్ సుభఖాన్‌కు ఏడాది జైలు రూ. 20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

హార్వెస్టర్ డ్రైవర్ మృతి

చౌటుప్పల్ : విద్యుదాఘాతంతో ఓ హార్వెస్టర్ డ్రైవర్ మృతిచెందాడు. చౌటుప్పల్ మండల పరిధిలోని తమ్మలోనిబావి గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం గురుకుంట గ్రామానికి చెందిన పల్లమోని కేశవులు(25) హార్వెస్టర్ వాహనాన్ని కొనుక్కొని తానే సొంతంగా నడుపుకుంటున్నాడు. అందులో భాగంగా గురువారం రాత్రి వరకు వలిగొండ మండలం వర్కట్‌పల్లిలో మిషన్ నడిపించాడు. ఆ తర్వాత చౌటుప్పల్‌కు వెళ్లే క్రమంలో తమ్మలోనిబావి శివారులో విద్యుత్ లైను హార్వెస్టర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై కేశవులు మృతిచెందాడు. ఎస్సై సీత పాండు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు

మోత్కూరు : మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సంద సుధీర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ మార్చి 7నుంచి సెలవుపై వెళ్లాడు. దీంతో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇర్షాద్‌కు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 21న తనకు పండుగ ఉందని మరో జూనియర్ అసిస్టెంట్ సుధీర్‌కు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సుధీర్ రాత్రి వరకు కార్యాలయంలో ఉండి నిబంధనలకు విరుద్ధంగా 66 డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో వారి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లుగా నిర్ధారించి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బతుకుదెరువు కోసం వలసవెళ్లి మృత్యుఒడికి

శాలిగౌరారం: బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వ్యక్తి ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. మండలంలోని బండమీదిగూడేనికి గ్రామానికి చెందిన గుండాల యల్లయ్య(47) బతుకుదెరువు కోసమని కల్లుగీసేందుకు ఆరేళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వలసవెళ్లి వస్తున్నాడు. అందులో భాగంగానే నాలుగు నెలల కిందట భార్యా, పిల్లలతో కలిసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వలస వెళ్లాడు. 26న సాయంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కిన యల్లయ్య ప్రమాదవశాత్తు కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. యల్లయ్య మృతదేహాన్ని బాధిత కుటింబీకుల శుక్రవారం స్వగ్రామానికి తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

కదంతొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

- మర్రిగూడ బైపాస్ నుంచి గడియారం సెంటర్ వరకు భారీ ర్యాలీ
- అభివాదం చేస్తూ పాదయాత్ర చేసిన రేవంత్‌రెడ్డి
- కార్యకర్తల కేరింతలు, ఈలలతో మార్మోగిన నల్లగొండ



మర్రిగూడ బైపాస్ నుంచి క్లాక్ టవర్ వరకు చేపట్టిన నిరసన పాదయాత్రలో అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎంజీ యూనివర్సిటీ నుంచి మర్రిగూడ బైపాస్ చేరుకోగానే కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. పలు నియోజకవర్గాల నుంచి అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న నాయకులు పార్టీ శ్రేణులతో వచ్చి రేవంత్‌కు స్వాగతం పలికేందుకు పోటీ పడ్డారు. మర్రిగూడ బైపాస్ జంక్షన్ వద్ద డీఎస్‌ఆర్ పేరుతో భారీ క్రేన్ ద్వారా గజమాల వేసేందుకు అక్కడ సిద్ధంగా ఉంచగా కార్యకర్తలు భారీగా వెంట రావడంతో దండ వేసుకోవడం సాధ్యపడలేదు. అక్కడి నుంచి డీజే పాటలతో వేలాది మంది కార్యకర్తలతో కలిసి ప్రధాన రహదారి వెంట రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. రేవంత్‌రెడ్డిని కలిసేందుకు, చూసేందుకు జనం భారీగా ఆయన దగ్గరికి వెళ్తుండడంతో పోలీసులు తాడుతో అదుపు చేశారు. దారి పొడవునా ప్రజలు, కార్యకర్తలు రేవంత్‌ను చూసేందుకు ఆసక్తి కనబర్చారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడ్డ ప్రజలకు అభివాదం చేస్తూ రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. వీటీ కాలనీ వద్ద, ఎన్జీ కాలేజీ వద్ద భారీ క్రేన్‌లతో రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేశారు. రేవంత్‌రెడ్డిని చూసేందుకు ఎన్జీ కాలేజీ జంక్షన్ వద్దకు భారీగా యువకులు తరలివచ్చారు. మర్రిగూడ బైపాస్ రోడ్డు నుంచి పెద్ద గడియారం సెంటర్ వరకు పాదయాత్ర సాగడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. తెలంగాణ పులి బిడ్డ రేవంత్‌రెడ్డి, నిగ్గదీసి అడిగే మొనగాడు రేవంత్ అని డీజే పాటలు వచ్చినప్పుడల్లా కార్యకర్తల కేరింతలు, ఈలలతో మార్మోగింది. రేవంత్‌రెడ్డి వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, చెవిటి వెంకన్న, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, జానారెడ్డి తనయులు కుందూరు రఘువీర్ రెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఉన్నారు.



నార్కట్‌పల్లిలో అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి



చౌటుప్పల్‌లో..

అమరులకు నివాళి

ఎంజీ యూనివర్సిటీ వద్ద అమరవీరుల చిత్రపటాలకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారీ ఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడ రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చేందుకు పోటీపడ్డారు.

భారీగా ట్రాఫిక్ జాం..

రేవంత్‌రెడ్డి రాకతో నార్కట్‌పల్లి – అద్దంకి రహదారిపై మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. అయితే యూనివర్సిటీ వద్ద విద్యార్థులతో మాట్లాడే సమయంలో ఇద్దరు ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు చర్చించుకున్నారు.

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

చౌటుప్పల్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించతలపెట్టిన నిరుద్యోగుల నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం చౌటుప్పల్‌లో ఆగారు. జాతీయ రహదారిపై స్థానిక బస్టాండు వద్ద ఆయనకు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో భారీ గజమాలను రేవంత్‌రెడ్డికి వేశారు. అభివాదం చేసుకుంటూ నల్లగొండకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల, మున్సిపల్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, ఏపూరి సతీష్, సుర్వి నర్సింహగౌడ్ ఉన్నారు.

చిట్యాల : నల్లగొండలో జరగనున్న నిరుద్యోగ నిరసన ర్యాలీకి వెళ్తున్న టీ పీసీసీ ప్రెసిడెంట్ రేంవత్‌రెడ్డికి చిట్యాలలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు క్రేన్ సహాయంతో భారీ గజమాలను రేవంత్‌రెడ్డికి వేశారు. అనంతరం వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీఓఏలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, జడల చినమల్లయ్య, ఎస్‌కె.ఇబ్రహీం, నీలకంఠం లింగస్వామి, గంగాధరపు గణేశ్, ఎడ్ల మహాలింగం పాల్గొన్నారు.



చిట్యాలలో వినతిపత్రం చదువుతున్న రేవంత్‌రెడ్డి

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి: నిరుద్యోగ నిరసన దీక్షకు హాజరవుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి నార్కట్‌పల్లిలోని నల్లగొండ బైపాస్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వేదాసు వెంకయ్య, కొండేటి మల్లయ్య, దైద రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



అమరులకు నివాళులర్పిస్తున్న రేవంత్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



క్లాక్‌టవర్ సెంటర్‌లో అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి



నేతలను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

కలెక్టర్ అభినందన

బీబీనగర్: మండలంలోని సాంఘిక సంక్షేమ సైనిక్ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థులు సుష్మ, స్నేహలత, మానస, శిరీష, వర్షితలు మే 3వ తేదీన నేపాల్‌లోని ఖాట్మాండు ప్రాంతంలో నిర్వహించే పర్వతారోహణ శిక్షణకు ఎంపికయ్యారు. దీంతో శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థుల ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. అలాగే డీసీపీ రాజేష్ చంద్ర అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగశర్మ, సైనిక్ విభాగం డైరెక్టర్ రాఖీ చౌహాన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పావని, శ్రీనివాస్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తేనే బీఆర్‌ఎస్‌కు వంద సీట్లు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసినప్పుడే బీఆర్ఎస్‌కు వంద సీట్లు వస్తాయని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేనిఫెస్టోను వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు మరో నాలుగు నెలలు ఉందని ఆలోపు ఇచ్చి హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్‌రూమ్‌లు, రేషన్‌కార్డులు, అర్హులైన వారికి పింఛన్లు, స్థలం ఉన్నవారికి రూ.5లక్షలు, లక్ష రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు, పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ, వీఓఏల సమస్యలు వంటి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఈనెల 1 నుంచి 7 వరకు నిర్వహించే మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. 12 గంటల పని విధానం, కనీస వేతనం లేకుండా చేయడం, సంఘాలు పెట్టుకోకుండా నిషేధించడం వంటి వాటిని అవలంబిస్తుందన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు సంఘటితంగా ఉండి పాలకుల విధానాలను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, వినోద్‌నాయక్, సైదులు, బాబునాయక్, వెంకట్‌రెడ్డి, రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ఎఫ్ఎం రేడియో కేంద్రాలు ప్రారంభం

రామగిరి(నల్లగొండ), దేవరకొండ: దేశ వ్యాప్తంగా శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 91 ఎఫ్ఎం రేడియో కేంద్రాలను వర్చువల్‌గా ప్రారంభించారు. దీంట్లో భాగంగా నల్లగొండ, దేవరకొండలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎఫ్ఎం రేడియో కేంద్రాలకు సంబంధించిన నూతన ట్రాన్స్‌మీటర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లగొండలో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఆలిండియా రేడియో తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇంజనీర్ నరేంద్ర కుమారి మాట్లాడుతూ ఆయా పట్టణాల పరిధిలో 20 కిలోమీటర్ల వరకు ఎఫ్ఎం రేడియో సేవలు అందుతాయన్నారు. నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో ఆలిండియా రేడియో తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ మూర్తి, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఎంపీ.రాజశేఖర్, బీజేపీ నాయకులు కంకణాల శ్రీధర్‌రెడ్డి, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, అలాగే దేవరకొండలో జరిగిన సమావేశంలో ఆర్డీఓ గోపీరాం, ప్రసార భారతి డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి, దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీడీఓ శర్మ, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, బీజేపీ నాయకులు కర్నాటి సురేష్, కళ్యాణ్ నాయక్, గుండాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో ట్రాన్స్‌మీటర్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

గాయపడిన వ్యక్తి మృతి

గరిడేపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ కొమిరెడ్డి కొండల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన జల్ల వెంకటేశ్వర్లు(52) గురువారం రాత్రి గరిడేపల్లిలో రోడ్డుదాటుతున్నాడు. ఈ క్రమంలో హుజూర్‌నగర్ నుంచి గరిడేపల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడిని ఏరియా ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతిచెందాడు. మృతుడి భార్య రామనర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.